వెంటిడుకొనిపోయ్యారు ఆవృక్షం సమీపానికి. బ్రాహ్మణుడు గడగడవణుకుతూ "అదిగోనయ్యా, ప్రాణభీతి" అని ధనమువైపుచూపి పరుగెత్తేడు. అంతట రాజకుమారులు బ్రాహ్మణుడు వెర్రివాడనుకున్నారు. ఇద్దరిమనస్సుల్లోను ఊహలు జనించడం మొదలైంది. రెండవవానిని మోసగించి ధనమంతయూ తానే అపహరించాలని బుద్ధిపుట్టింది యిద్దరికికూడాను. పెద్దవాడు చిన్నవానినిచూచి "ఓయి! ఇప్పటికే చాలాకాలమైనది. మనయిద్దరికి భోజనం యిక్కడికే తెమ్ము. భోజనం కుడిచినతర్వాత ఇంటికి ధనసమేతులమై వెళ్లవచ్చు"నని చిన్నవానిన్ని పంపివేసెను. పంపేసి యిలా ఆలోచించేడు: "తమ్ముడు అన్నం క్రిందపెట్టుసమయములో ఇదే కరవాలంతో వానిశిరస్సును ఖండించేస్తా. ఈధనమంతయూ నాకేదక్కును కదా!" చిన్నవాడు గృహోన్ముఖుడై "నేను ఇంట్లోనే భుజించి పెద్దవానికి విషమిళితమైన అన్నం తీసుకపోతాను. పెద్దవాడు చచ్చును. ధనమంతయూ నాదే" ననుకొంటూ అలాగే తెచ్చేడు అన్నాన్ని. తమ్ముడు తలవంచడంతోనే తనకరవాలంతో తమ్ముని శిరస్సుఖండించేడు అన్న. "తమ్ముడుచచ్చేడు, ధనమంతయు నాదే" ననుసంతోషంతో పర్వదినంలాగ భుజించివాడు తమ్ముడుతెచ్చినదానిని. విషం తలకెక్కింది. తానుకూడా నీల్గేడు. ధనమన్న ప్రాణభీతి సుమా!

## నువ్వా దొంగవే

శ్రీమతి ఆదుర్తి సత్యాబాయి గారు

(శిబిరంలో సోఫామీద అలగ్జాండరుచక్రవర్తి, ఎదురుగా కాళ్ళకి చేతులకి సంకెళ్ళతో ఒకముష్కరుడూ, వానికిచెరో ప్రక్కా బోరలు విరుచుకుని ఇద్దరుసైనికులూ నిలువబడిఉంటారు.)

అలగ్జాండరు:—(సైనికునిచూస్తూ) వీడేనా తారాసియన్‌దొంగ? ఇన్నాళ్ళబట్టీ మన పల్లెల్ని దోచుకు తిరుగుతున్నాడు?

ముష్కరుడు:—అవును. నేనే తారాసియన్‌ను. వీరయోధుడను.

అల:—(చిరునవ్వుతో) వీరయోధుడవా? బందిపోటుదొంగవు. నరహంతకుడివి. దేశానికి విపత్కరుడవి. నీధైర్యాన్ని నేను ప్రశంసిస్తానుగాని నువ్వుచేసినపన్లకిమాత్రం తగినశిక్ష విధిస్తేగాని నేను శాంతిపడలేను.

ముష్క:—అలగ్జాండరుచక్రవర్తికికూడా కోపంవచ్చే పనుల్ని నేనేమిచేశాను?

అల:—ఏమీఎరగనట్లు మాట్లాడుతావేమిటి? నాఆజ్ఞలను అతిక్రమించి నువ్వు నడవడంలేదూ? నాదేశశాంతికి నీవు భంగంకలిగించలేదూ? నీతోడి ప్రజల ధనధాన్యాలపహరించి వాళ్ళని క్షోభపెట్టలేదూ?

ముష్క:—అలగ్జాండరుచక్రవర్తీ! ఇప్పుడు నేను నీఅధీనంలోఉన్నఖైదీని. నీవేమన్నా నేను పడవలసిందే. నీవేశిక్షవిధించినా అనుభవించవలసిందే. కాని నాఆత్మమీద మాత్రం నువ్వు అధికారం చెలాయించలేవు. అందుచేత నీకు జవాబిచ్చేటప్పుడుకూడా సర్వస్వతంత్రుడిలాగే మాట్లాడుతాను.

అల:—అలాగేమాట్లాడు. నేను సంభాషిస్తూఉన్నప్పుడు నాఅధికారబలంచేత ఎదుటివాడినోరుకట్టడం నామతంకాదు.

836

ముష్క:—కృతజ్ఞుడిని. నీఉదారస్వభావాన్కి వందనాలు. అయితే నీప్రశ్నకి జవాబుగా మరోప్రశ్న వెయ్యవలసివచ్చింది. నీజీవితాన్ని ఏవిధంగాగడుపుతున్నావు?

అల:—మహావీరుడిలాగ. నాకీర్తికాంతనడుగు. అదేచెబుతుంది. యోధాగ్రేసరులకల్లా నేను తలమానికాన్ని. రాజాధిరాజులందరికీ నేను సార్వభౌముడిని. దిగ్విజయకాలంలో జయలక్ష్మికి నన్నుమించినవరుడు దొరకడు.

ముష్క:—ఆలాగా! కీర్తికాంత నాగురించి మాత్రం చెప్పదూ? ఉక్కుతునకల్లాంటి నాగుంపులాంటిగుంపుకాని, అటువంటిగుంపుకి నావంటి ధైర్యసాహసాలుకలిగిన నాయకుడుగాని మరెక్కడేనాఉన్నారా? ప్రపంచములో ఎక్కడేనా ఎప్పుడేనా-ఎందుకూ-నాగొప్ప నేను చెప్పుకోడం నాకురోత. నీమట్టుకు నీకు తెలియదాయేమిటి? నన్నుపట్టుకోడాన్కి నీవాళ్ళన్ని చెరువులనీళ్ళుతాగిరో?

అల:—అయినప్పటికీ నువ్వుదొంగవే. కులహీనుడవీ, గౌరవశూన్యుడవీ అయిన పచ్చిదొంగవు.

ముష్క:—అలాగైతే దిగ్విజయిలక్ష్మీవరుడెవరు? నీవుకూడా ప్రపంచమంతటా మహారాక్షసుడిలాగ సంచరింపలేదూ? సౌభాగ్యవంతాలైనపచ్చటిపొలాల్ని, సుందరములైన మహానగరాల్నీ నాశనంచేయలేదూ?శాంతినీ పరిశ్రమల్నీ భంగిపుచ్చలేదూ?న్యాయంలేకుండా-ధర్మం ఆలోచింపకుండా-దోచుకుని, చంపి-చీకాకుపెట్టేసి—ఇవన్నీ ఎందుకు? దేశాల్నిజయిద్దామన్న అంతులేనిఆశని సంతోషపెట్టడానికేకదూ? ఓవందమంది అనుచరులతో ఓవరగణాకి నేనేమిటిచేశానో లక్షలాదిసైనికులతో మహాసామ్రాజ్యాలకి నువ్వూ అదేచేశావు. నేను ఒక్కొక్క మనిషిని దోచుకుంటె నువ్వు మహారాజుల్ని, చక్రవర్తుల్ని దోచుకున్నావు. నేను ఓవోరెండుమూడుపల్లెల్ని తగలెడితే నువ్వు మహాసామ్రాజ్యాలనే నాశనంచేశావు. మనిద్దరికీ భేదం ఏమిటుంది? నేనోబీదవాడికిపుట్టేను-నువ్వోక మహారాజుకుపుట్టేవు. అంచేత నువ్వు రాజ్యాలకి రాజ్యాలేదోచుకుని మహాదొంగ వవగలిగేవు.

అల:—కాని రాజునై నేను తీసికొంటే రాజులాగేతిరిగియిచ్చేను. రాజ్యాలని జయిస్తే మహాసామ్రాజ్యాల్ని స్థాపించేను. చిత్రకళల్ని-వాణిజ్యాన్ని-వేదాంతవిద్యనూకూడా మంచి అభివృద్ధిలోకి తీసుకొస్తున్నాను.

ముష్క:—నేనుకూడా గొప్పవాళ్ళదగ్గిరనుండి సంగ్రహించింది బీదవాళ్ళకుచితంగా ఇస్తున్నాను. ముష్కరులున్న నాసంఘంలో కట్టుబాటు, విధేయత నెలకొల్పేను. చేజిక్కినంత వరకూ అనాథుల్ని రక్షిస్తున్నాను. నువ్వుచెప్పిన ఆవేదాంతంగురించి నాకేమీ తెలియదుగాని యీప్రపంచాన్కి మనంచేసినద్రోహం నువ్వుకాని నేనుకాని ఎన్నడూ ఏవిధంగానైనా కప్పిపుచ్చుకోలేమని నాకు నిశ్చయంగా తెలుసును.

అల:—(సైనికులతో) సంకెళ్ళనువిప్పి ఆతడిని ఆదరించండి. ఒక్కక్షణం నన్ను ఒంటరిగా వదిలిపెట్టండి.

—సైనికులూ ముష్కరుడు నిష్క్రమింతురు.

(తనలో) ఏమిటిదీ? నేనూ, ఈదొంగా ఒక్కలాంటివాళ్ళమేనా? అలగ్జాండరుకూడా దొంగే? అవునుకాబోలు.

## దురాశ దుఃఖానికి చేటు

శ్రీమతి జి. గోపీబాయిగారు

అనగాఅనగా ఒకవూరు. అవూళ్లో నలుగురుదొంగలు ఉండేవారు. ఆనలుగురుచేరి ఒకషావుకారు ఇంట్లో కన్నంవేశారు. ఆధనముతీసుకొని వెళ్లుతూఉండగా దారిలో ఒక డన్నాడు ఆధనము నలుగురుపంచుకుందామని. ఆమాటకు అందరు సరేనంటేసరేనన్నారు. వాళ్లు అప్పుడు ఒకపాడుదేవాలయము దగ్గరకివచ్చి కూర్చున్నారు. అప్పుడు ఒకడు ఒరే అన్నా మనకునిన్న ఏదేవుడిదయవల్లనో చాలాధనము దొరికింది. ఇప్పుడు కొన్నిరూపాయిలు తీసుకొని బజారుకివెళ్లి మంచిమంచి తినువస్తువులు తెచ్చుకొని కడుపునిండాతిని నీళ్లుత్రాగి అప్పుడు ధనముపంచుకుందాం అని అన్నాడు. ఈమాటకి అందరు వప్పుకొని కొంతడబ్బు ఇచ్చి ఇద్దరిని బజారుకిపంపించేరు. అప్పుడు ఆఇద్దరిలో ఒకడు ఒరేఅన్నా ఇన్నాళ్లనుంచి కష్టపడి డబ్బుసంపాదించేను. ఒకకానియైనను నాదగ్గరలేదు. ముసలివాణ్ణయాను. చచ్చినా ఈడ్చటానికి డబ్బులేదు. కనుక ఇప్పుడైనా మనము జాగ్రత్తపడాలే అని నాకుతోస్తుంది. అని అన్నాడు. అప్పుడు రెండవవాడు నాకుఅల్లాగెతోస్తుంది. నీవె ఆడబ్బుఅంతా మనకు వచ్చేటట్టు ఉపాయంచెప్పాలెఅన్నాడు. దానికి మొదటివాడు నాకు మంచిఉపాయంతోస్తోంది. అదిఏమంటే ఈతినేవస్తువుల్లోవిషంవేసి వాళ్లకిఇచ్చినట్టయితే వాళ్లుఎరగకతిని చచ్చిపోతారు. తరవాత ఆధనంమనము ఇద్దరంపంచుకుందాం అనిఅన్నాడు. దానికి వాడు వప్పుకొన్నాడు. ఇద్దరుచేరి బజారుకువెళ్ళి బర్ఫీ, జిలేబీ, మిఠాయి మొదలైనవికొని వానిలో విషంకలిపి తీసుకువెళ్లేరు గుడిదగ్గరకి. అప్పుడువారు అన్నలారా వచ్చేరా? మీకోసం మేమిద్దరము కాచుకొనిఉన్నాము. చప్పున కాళ్లుచేతులుకడుక్కొని వద్దాముురాండి చాలాఆకలి అవుతున్నది. అని అన్నారు. దానికి వారు సంతోషపడి నలుగురుదొంగలు భావివద్దకెళ్లేరు. అప్పుడు మిఠాయితెచ్చిన ఇద్దరుదొంగలు నీళ్ళు చేస్తూఉండగా వెనకాలనించి ఆఇద్దరిని భావిలోకి తోశేసి బాగాకడుపునిండా నీళ్ళుతాగండి. తాగండినీళ్ళు అని మిగిలినఇద్దరు కేకలువేశారు. అపుడువాళ్ళిద్దరు చచ్చిపోయారు. వారు సంతోషముతో గంతులువేస్తూ పరుగునవెళ్లి అంతా మిఠాయి జిలేబి కడుపునిండాతినేశారు. లేచేటప్పటికి కళ్ళు గిర్రునతిరిగి కిందపడిపోయారు మళ్ళాలేవకుండాను. పాపం. కథ కంచికి మన మింటికి.